జాతీయస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ధర్మారం(బీ) విద్యార్థిని

ఇందల్వాయి, జనవరి 6 : నిర్మల్ జిల్లా ఎన్టీఆర్ స్టేడియంలో గత నెల 21 నుంచి 23వ తేదీ వరకు నిర్వహించిన 67వ స్కూల్ గేమ్స్ రాష్ట్ర సాఫ్ట్‌బాల్ అండర్-17 పోటీల్లో ధర్మారం (బీ)లోని టీఎస్‌డబ్ల్యూఆర్ఎస్ విద్యార్థిని దీప ప్రతిభ కనబర్చింది. జిల్లా జట్టు తరపున పాల్గొని బంగారు పతకం సాధించడంలో కీలకపాత్ర పోషించి, ఈనెల 10 నుంచి 15వ తేదీ వరకు రాజస్థాన్‌లోని బికినీర్‌లో నిర్వహించే జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయిని సంగీత తెలిపారు. కార్యక్రమంలో స్కూల్ ఫిజికల్ డైరెక్టర్ నీరజా రెడ్డి, పీఈటీ జ్యోత్స్న, హౌస్ టీచర్ దమయంతి, సిబ్బంది దీపను శనివారం అభినందించారు.

స్వయం ఉపాధి శిక్షణ ప్రారంభం

ఇందల్వాయి, జనవరి 6 : డిచ్‌పల్లి మండలం ఘన్‌పూర్‌లో ఉన్న ఎస్‌బీఐ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థలో బ్యూటీపార్లర్, మగ్గం శిక్షణను ఎస్‌బీఐ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ వి.జగన్నాథాచారి, నాబార్డు డీపీఎం ప్రవీణ్‌కుమార్ శనివారం ప్రారంభించారు. అనంతరం పలు శిక్షణ తరగతులను పరిశీలించారు. వ్యవసాయ అనుబంధ వృత్తులకు నాబార్డు ఎల్లప్పుడూ సహాయకారిగా ఉంటుందని అభ్యర్థులకు సూచించారు. కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్ సుంకం శ్రీనివాస్, భాగ్యలక్ష్మి, రంజిత్, నవీన్, నర్మద, ఫరీదా తదితరులు పాల్గొన్నారు.

ఢిల్లీలో అర్చరీ అసోసియేషన్ సమావేశానికి హాజరైన ఈగ సంజీవ్‌రెడ్డి


సమావేశంలో పాల్గొన్న ఈగ సంజీవ్‌రెడ్డి

ఇందల్వాయి / నిజామాబాద్ స్పోర్ట్స్, జనవరి 6 : ఢిల్లీలో శనివారం జరిగిన అర్చరీ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా మీటింగ్‌కు అర్చరీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు, రాష్ట్ర ప్రధానకార్యదర్శి ఈగ సంజీవ్‌రెడ్డి హాజరయ్యారు. త్వరలో నిర్వహించే ఆర్చరీ ఫెడరేషన్ ఎన్నికల నేపథ్యంలో సమావేశం నిర్వహించారని తెలిపారు. అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తున్న క్రీడాకారులకు అభినందనలు తెలిపారు.

వైభవంగా అయ్యప్ప విగ్రహప్రతిష్ఠాపన

విగ్రహాన్ని ప్రతిష్ఠిస్తున్న విద్యారణ్య భారతీ స్వామి

మోర్తాడ్, జనవరి 6: మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన ఆలయంలో శనివారం అయ్యప్ప విగ్రహప్రతిష్ఠాపన కార్యక్రమం నిర్వహించారు. హంపీ పీఠాధిపతి జగద్గురు విద్యారణ్య భారతీ స్వామి హాజరై వివిధ పూజలు నిర్వహించారు.

టిప్పర్లకు జరిమానా

నవీపేట, జనవరి 6: మండలంలోని కోస్లీ శివారులో అనుమతి లేకుండా మొరం తరలించిన రెండు టిప్పర్లకు రూ. 20 వేల జరిమానా విధించినట్లు తహసీల్దార్ ధన్వాల్ శనివారం తెలిపారు. ఈనెల 5న కోస్లీ శివారు నుంచి అక్రమంగా మొరం తరలిస్తున్న టిప్పర్లను పట్టుకున్నట్లు చెప్పారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

రెంజల్, జనవరి 6: మండలంలోని నీలాలో అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను సీజ్ చేసినట్లు ఎస్సై ఉదయ్ కుమార్ శనివారం తెలిపారు. ఇసుక ట్రాక్టర్‌కు జరిమానా కోసం తహసీల్దార్‌కు అప్పగించినట్లు ఎస్సై ఉదయ్‌కుమార్ తెలిపారు.

క్యాలెండర్ల ఆవిష్కరణ

ఆర్మూర్‌టౌన్/మోర్తాడ్/ముప్కాల్, జనవరి6: ఆర్మూర్ పట్టణంలోని చిన్న బజార్‌లో శ్రీ లక్ష్మీనారాయణ మందిరంలో క్షత్రియ సమాజ్ పెద్ద మనుషులతో కలిసి ఎంపీ అర్వింద్ శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం క్యాలెండర్లను ఆవిష్కరించారు. మోర్తాడ్ మండల విద్యావనరుల కేంద్రం వద్ద యూటీఎఫ్ నూతన సంవత్సర క్యాలెండర్‌ను మండల విద్యాధికారి ఆంధ్రయ్య ఆవిష్కరించారు. ముప్కాల్ మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశలతో పాటు రెంజర్ల, కేజీబీవీ పాఠశాల ఆవరణలో పీఆర్టీయూ ప్రతినిధులు, నాయకుల సమక్షంలో ఆసంఘం క్యాలెండర్‌ను ఆవిష్కరించారు.

పట్టాదారు పాస్‌పుస్తకాలు ఇప్పించాలని వినతి

నిజామాబాద్ రూరల్/ మోపాల్ (ఖలీల్‌వాడి), జనవరి 6 : తమకు పట్టాదారు పాస్‌పుస్తకాలు అందజేయాలని కోరుతూ నగర శివారులోని సారంగపూర్ గ్రామ నిరుపేదలు రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డికి శనివారం విన్నవించారు. 92, 47 సర్వే నంబర్లలో కొన్నేండ్ల నుంచి ప్రభుత్వ భూముల్లో పంటలు సాగు చేసుకుంటున్నామని, పట్టాదారు పాస్‌పుస్తకాలు ఇప్పించాలని కోరారు. మోడల్ స్కూల్ ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ బీసీ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు మాడవేడి వినోద్‌కుమార్ సంఘం ప్రతినిధులతో కలిసి ఎమ్మెల్యే భూపతిరెడ్డికి విన్నవించారు. బదిలీలు, ప్రమోషన్లు చేపట్టాలని, 010 ట్రెజరీ అకౌంట్ నుంచి జీతాలు, హెల్త్‌కార్డులు ఇప్పించాలని కోరారు.

వరద కాలువకు నీటి విడుదల

ముప్కాల్(మెండోరా), జనవరి 5: యాసంగి పంటల సాగు కోసం శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నుంచి 2000 క్యూసెక్కుల నీటిని శనివారం విడుదల చేసినట్లు ఈఈ చక్రపాణి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతులు, జాలర్లు, పశువుల కాపరులు వరద కాలువ వైపు వెళ్లవద్దని సూచిచారు.

వాటర్ డిస్పెన్సర్ అందజేత

నందిపేట్, జనవరి 6: ఖుద్వాన్‌పూర్ శ్రీలక్ష్మీ అండళ్ సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయానికి దుబాయ్ శ్రీను భక్తుల సౌకర్యార్థం వాటర్ డిస్పెన్సర్‌ను విరాళంగా శనివారం అందజేశారు. ఆలయ కమిటీ సభ్యులు, ఆయనను సన్మానించారు.

KSHATRIYA COLLEGE OF ENGINEERING
approved by AICTE, New Delhi & affiliated to JNTUH, Hyderabad
NH-63, Chepur - Armoor, Dist: Nizamabad - 503 224, TS, Mob:99892 88829
www.kcea.ac.in Email: kcea.es@gmail.com
NOTIFICATION FOR FACULTY RECRUITMENT
Applications are invited for the following positions:

Position	Departments
Professors, Associate Professors, Assistant Professors, Programmers and Lab Technicians	CIV, EEE, MEC, ECE, CSE, Mathematics, Physics, Chemistry, English and MBA

Qualifications and Experience as per AICTE Norms.
Send your resume along with copies of certificates to **kcea.es@gmail.com** latest by **18-01-2024**
Interviews will be held at college premises for the shortlisted candidates.
Date: 07-01-2024 Sd/- Principal, KCEA

అయోధ్య రాముడి పూజిత అక్షింతల శోభాయాత్ర

లక్ష్మాపూర్‌లో అక్షింతల శోభాయాత్రలో పాల్గొన్న గ్రామస్తులు

బోధన్ మండలం ఎరాజ్‌పల్లిలో అయోధ్య రాముడి అక్షింతల పంపిణీ కార్యక్రమం ప్రారంభిస్తున్న మల్లరం స్వామి పిట్ల కృష్ణమహరాజ్

సిరికొండ/ చందూర్, జనవరి 6 : మండలంలోని చీమన్‌పల్లి గ్రామానికి చెందిన అయోధ్య రాముని పూజిత అక్షింతలు చేరాయి. శివాలయం కమిటీ ఆధ్వర్యంలో వాటికి పూజలు చేసి గ్రామంలోని వీధుల గుండా ఊరేగింపు నిర్వహించారు. ఊరేగింపు అనంతరం గ్రామశివారులో ఉన్న శివాలయం వద్దకు తీసుకెళ్లి పూజలు నిర్వహించారు. అనంతరం అక్షింతలను గ్రామంలో పంపిణీ చేశారు. చందూర్ మండలంలోని లక్ష్మాపూర్‌లో అక్షింతలను గ్రామస్తులు ఊరేగించారు. యువత పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రధాన వీధుల గుండా శోభాయాత్ర నిర్వహించారు.

నెల 22న దీపాలు వెలిగించాలి

అయోధ్యలో ఈ నెల 22న రాముడి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవంలో భాగంగా ప్రతి ఇంటా దీపావళి జరుపుకోవాలని, దీపాలను వెలిగించాలని మల్లరం స్వామి పిట్ల కృష్ణ మహరాజ్ అన్నారు. బోధన్ మండలంలోని ఎరాజ్‌పల్లి గ్రామంలో అయోధ్య రాముడి అక్షింతల పంపిణీ కార్యక్రమానికి హాజరై ఆయన ప్రారంభించారు.

ఆర్మూర్‌లో తహసీల్దార్ శ్రీకాంత్‌కు అయోధ్య శ్రీరామ జన్మభూమి తీర్థక్షేత్ర ట్రస్ట్ సభ్యులు అక్షింతలు అందజేశారు.

మాక్లూర్, బాల్కొండ, భీమ్‌గల్, కమ్మర్‌పల్లి, బోధన్ పట్టణ పరిధిలోని నర్సాపూర్, నందిపేట, రెంజల్ మండలంలోని కందకుర్తి గ్రామంలో అయోధ్య అక్షింతలను ఇంటింటా పంపిణీ చేశారు.

వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా బోధించాలి

■ జిల్లా ఇంటర్ విద్యాధికారి రఘురాజ్

సమావేశంలో మాట్లాడుతున్న ఇంటర్ జిల్లా విద్యాధికారి రఘురాజ్

ఖలీల్‌వాడి, జనవరి 6 : ఇంటర్ ప్రాక్టికల్, వార్షిక పరీక్షల్లో విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా బోధన చేయాలని జిల్లా ఇంటర్ విద్యాధికారి రఘురాజ్ అధ్యాపకులకు సూచించారు. నగరంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో అకడమిక్ సమీక్షా సమావేశాన్ని ప్రిన్సిపాల్ నుస్రత్ జహన్ అధ్యక్షతన శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా రఘురాజ్ మాట్లాడుతూ.. చదువులో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి, వారికి ప్రత్యేక తరగతుల నిర్వహణ, శిక్షణ ఇవ్వాలని ఆదేశించారు.

న్యాయసేవాధికార సంస్థకు వెన్నుదున్నుగా మీడియా

సమావేశంలో మాట్లాడుతున్న జడ్జి సునీత కుంచాల

నిజామాబాద్ లీగల్, జనవరి 6: న్యాయసేవాధికార సంస్థ కార్యక్రమాల వివరాలు ప్రజలకు చేరవేయడంలో మీడియా ప్రధానభూమిక పోషిస్తున్నదని జిల్లా ప్రధానన్యాయమూర్తి సునీత కుంచాల అన్నారు. జిల్లావ్యాప్తంగా డిసెంబర్ 30న నిర్వహించిన జాతీయ లోక్‌అదాలత్ విజయవంతమైన నేపథ్యంలో ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులతో శనివారం నిర్వహించిన సక్సెస్‌మీట్‌లో న్యాయసేవాధికారి సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి పద్మావతితో కలిసి ప్రసంగించారు. సంస్థ కార్యక్రమాల ప్రచారం, విజయవంతానికి మీడియా సహాయ, సహకారాలు అందించాలని కోరారు.

ఆపరేషన్ స్మైల్‌పై రైల్వే పోలీసుల అవగాహన

అవగాహన కల్పిస్తున్న రైల్వే పోలీసులు

నిజామాబాద్ క్రైం, జనవరి 6 : జిల్లాకేంద్రంలోని రైల్వేస్టేషన్‌లో ఆపరేషన్ స్మైల్-10 కార్యక్రమంపై రైల్వే పోలీసులు చైల్ వెల్ఫేర్ కమిటీతో కలిసి శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రైల్వే సీఐ వెంకటరమణ మాట్లాడుతూ.. బాలలతో వెట్టిచాకిరి చేయించినా, బాల కార్మికులను పనిలో పెట్టుకున్నా చట్టరీత్యా నేరమని తెలిపారు. అనాథ పిల్లలు కనిపిస్తే తమకు సమాచారం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో రైల్వే ఎస్సై సాయిరెడ్డి ,సీడబ్ల్యూసీ టీం సభ్యులు చైతన్య, జమ్రూ పాల్గొన్నారు.

కేసుల నమోదులో జాగ్రత్తలు పాటించాలి

శక్కర్‌నగర్, జనవరి 6: ఇటీవల విపరీతంగా పెరిగిన వివిధ రకాల గేమింగ్ కేసుల నమోదులో జాగ్రత్తలు పాటించాలని బోధన్ న్యాయస్థానం అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ చిదిరాల రాణి సూచించారు. శనివారం బోధన్ పట్టణంలోని న్యాయస్థానంలో పోలీసులకు బోధన్ న్యాయస్థానంలో శిక్షణా శిబిరం నిర్వహించారు. అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ చిదిరాల రాణి, అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్లు శ్యాంరావు, డాక్టర్ పల్నాటి సమ్మయ్య అవగాహన కల్పించారు. బోధన్ పట్టణ సీఐ బి.వీరయ్య, రూరల్ సీఐ జి.శ్రీనివాస రాజు, వర్ని, రెంజల్ ఎస్సైలు కృష్ణ కుమార్, ఉదయ్ కుమార్, బోధన్ రూరల్ ఎస్సై నాగనాథ్, రుద్రూర్ ఏఎస్సై రాజు, పారెస్ట్ అధికారులు శ్రీదేవి, లక్ష్మీనారాయణ, రాజేందర్, బాలకృష్ణ, వినయ్‌కుమార్, సయ్యద్ సాబేర్ హాజరయ్యారు.

విద్యార్థినులకు అభినందన

మోర్తాడ్, జనవరి 6: ఇటీవల ముంబైలో నిర్వహించిన రంగోత్సవ్ పోటీల్లో మోర్తాడ్ బాలికల ప్రాథమిక పాఠశాల విద్యార్థినులు గెలుపొందారు. వారికి ముంబై నుంచి వచ్చిన బహుమతులను కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు ప్రభాకర్ శనివారం అందజేసి అభినందించారు. కార్యక్రమంలో హెచ్ఎం బాలరాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అట్టలు, గ్లాసుల పంపిణీ

శక్కర్‌నగర్, జనవరి6: బోధన్ పట్టణానికి చెందిన సామాజిక కార్యకర్త సనాపటేల్ చౌరవతో పాఠశాల గెజిటెడ్ హెచ్ఎం అనంతుల కిషోర్ బోధన్ పట్టణంలోని తట్టికోట్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల టెన్త్ విద్యార్థులకు శనివారం పరీక్ష అట్టలను పంపిణీ చేశారు. దాతల సహకారంతో పరీక్ష అట్టలు, జావ తాగేందుకు స్టీలు గ్లాసులు అందజేశారు. దాతలు డిప్యూటీ తహసీల్దార్ స్రవంతి, ప్రముఖ వ్యాపార వేత్త సురేశ్ ఇనానీకి పాఠశాల తరపున కృతజ్ఞతలు తెలిపారు.

ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రం తనిఖీ

రెంజల్, జనవరి 6: తాడ్‌బిలోలి గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రాన్ని శనివారం కేంద్ర బృందం(ఎన్‌క్యూఎస్) టీం అధికారులు తనిఖీలు చేపట్టారు. దవాఖానలో ప్రజలకు అందుతున్న సేవలు, నమోదు చేసిన రికార్డులు, రిజిస్టర్లలో పొందు పరచిన వివరాలను కేంద్రానికి నివేదిస్తామని టీం అధికారులు డాక్టర్ విజయ్‌కుమార్, డాక్టర్ సయ్యద్ ఫారిదుద్దీన్ పేర్కొన్నారు. వారి వెంట జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి సుదర్శనం, మండల వైద్యాధికారి వినయ్‌కుమార్, హెచ్ఈవో శ్రావణ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఆర్మూర్‌టౌన్,జనవరి6: పట్టణంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ మహిళా గురుకుల డిగ్రీ కళాశాలలో పొలిటికల్ సైన్స్, కంప్యూటర్ సైన్స్ అతిథి అధ్యాపకులుగా పనిచేసేందుకు ఆసక్తి ఉన్న మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ధనవేణి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 11లోపు దరఖాస్తులను కళాశాలలో అందజేయాలని పేర్కొన్నారు. 19న రాత పరీక్ష, డెమో, ఇంటర్వ్యూ నిర్వహించి ఎంపిక చేస్తామని, మహిళా అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపల్ తెలిపారు.

బోధన్‌కు వ్యాగన్ల ద్వారా యూరియా

బోధన్, జనవరి6: బోధన్ డివిజన్ కేంద్రానికి ఇకనుంచి యూరియా రైల్వే వ్యాగన్ల ద్వారా నేరుగా సరఫరాకానుంది. ఇప్పటివరకు నిజామాబాద్ రైల్వే స్టేషన్ వరకు రైల్వే వ్యాగన్ల ద్వారా యూరియా వస్తుండేది. అక్కడి నుంచి బోధన్‌కు, ఇతర మండలాల్లోని ఎరువుల డీలర్లు, సహకార సంఘాలకు లారీల్లో యూరియాను సరఫరాచేసేవారు.

మొదటిసారి బోధన్ రైల్వే స్టేషన్‌కు వ్యాగన్ల ద్వారా వచ్చిన యూరియా డంపింగ్‌ను శనివారం బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి ప్రారంభించారు. ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో యాసంగిలో 6 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వచ్చే అవకాశం ఉందని, 70 వేల మెట్రిక్ టన్నుల ఎరువులు జిల్లాకు అవసరం ఉందని తెలిపారు. ఇందులో 50 వేల మెట్రిక్ టన్నుల ఎరువులు వచ్చాయని, ఇప్పటికే 25 వేల మెట్రిక్ టన్నుల ఎరువులు రైతులు తీసుకున్నారని తెలిపారు. కార్యక్రమంలో బోధన్ మున్సిపల్ చైర్‌పర్సన్ తూము పద్మావతి శరత్‌రెడ్డి, బోధన్ ఆర్డీవో రాజాగౌడ్, అధికారులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత శిఖరాలు అధిరోహించాలి

మాట్లాడుతున్న సివిల్ జడ్జి వేముల దీప్తి

ఆర్మూర్‌టౌన్, జనవరి6: విద్యార్థులు ఇష్టంతో చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని సివిల్ జడ్జి వేముల దీప్తి అన్నారు. చేపూర్ జడ్పీ ఉన్నత పాఠశాలలో ఏర్దట్ల రాజుబాయి ట్రస్ట్ ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు పరీక్ష అట్టలు, సామగ్రిని శనివారం అందించారు. ముఖ్య అతిథిగా హాజరైన సివిల్ జడ్జి మాట్లాడారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు, హెచ్ఎం చేతన కుమారి, సర్పంచ్ సాయన్న పాల్గొన్నారు.

విద్యార్థినికి బాల ప్రతిభా పురస్కారం

ఏర్గట్ల, జనవరి6: మండలంలోని తడ్‌పాకల్ జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థిని ఐ.సౌమ్య సాహిత్యంలో బాల ప్రతిభా పురస్కారం అందుకున్నట్లు పాఠశాల తెలుగు పండితుడు ప్రవీణ్ శర్మ శనివారం తెలిపారు. 2022-23గాను సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్‌కు చెందిన డా.చింతోజు బ్రహ్మయ్య జ్ఞాపకార్థం నిర్వహించిన సాహిత్య పోటీల్లో విద్యార్థులు సమీన్ 'ముద్ద బంతి', సౌమ్య 'బంగారు బాల్యం' పుస్తకాలు రాశారని తెలిపారు. సౌమ్యకు పురస్కారం లభిందచిందని తెలిపారు. త్వరలో నగదు బహుమతితోపాటు ప్రశంసా పత్రాలు అందుతాయని తెలిపారు.

15 మంది వీడీసీ సభ్యులపై కేసు

• గ్రామ బహిష్కరణ చేస్తామని బెదిరించడంతో..

జక్రాన్‌పల్లి, జనవరి 6 : మండల కేంద్రంలోని రజక కులస్తుల భూమిని వీడీసీకి ఇవ్వాలని, లేకపోతే గ్రామ బహిష్కరణ చేస్తామని స్థలాన్ని ఆక్రమించిన వీడీసీ సభ్యులపై శుక్రవారం రాత్రి కేసు నమోదు చేసినట్లు ఎస్సై తిరుపతి తెలిపారు. 15 మంది వీడీసీ సభ్యులపై కేసు నమోదు చేసి, శనివారం కోర్టు ఎదుట హాజరుపర్చినట్లు ఎస్సై తెలిపారు. వీడీసీలు ఇలాంటి చర్యలు పాల్పడితే చట్టరీత్యా చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇలాంటి ఘటనలు చోటుచేసుకుంటే 8712659853 నంబర్‌కు ఫోన్ చేసి సమాచారం అందించాలని సూచించారు.

ప్రేమపేరుతో వేధిస్తున్న యువకుడిపై..

జక్రాన్‌పల్లి, జనవరి 6 : జక్రాన్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఓ గ్రామానికి చెందిన ఓ మైనర్ బాలికను ప్రేమపేరుతో వేధిస్తున్న యువకుడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తిరుపతి తెలిపారు. బాలిక కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు అదే గ్రామానికి చెందిన ప్రణవ్ అనే యువకుడిపై కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

ప్రభుత్వ వసతిగృహాలకు దుప్పట్ల అందజేత

విద్యార్థులకు పంపిణీ చేసిన అధికారులు

కలెక్టర్ అందజేసిన దుప్పట్లతో విద్యార్థినులు

ఖలీల్‌వాడి, జనవరి 6: జిల్లాలోని వివిధ ప్రభుత్వ వసతిగృహాల విద్యార్థులకు శనివారం కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు దుప్పట్లను అందజేశారు. నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని శుభాకాంక్షలు తెలియజేసేందుకు వచ్చే వారు పూలబొకేలకు బదులుగా విద్యార్థుల సౌకర్యార్థం వారికి ఉపయుక్తంగా నిలిచేలా దుప్పట్లు, నోటుపుస్తకాలు అందించాలని కలెక్టర్ చేసిన విజ్ఞప్తికి అనూహ్య స్పందన లభించింది. వివిధ శాఖల జిల్లా అధికారులతోపాటు రైస్‌మిల్లర్స్ అసోసియేషన్, అనధికార ప్రముఖులు, రాజకీయ నాయకులు, వివిధ సంఘాల బాధ్యులు, ఉద్యోగ సంఘాల ప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులు తదితరులు కలెక్టర్‌ను కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతూ దుప్పట్లు, నోటుపుస్తకాలను అందజేశారు.వాటిని వసతి గృహాల విద్యార్థులకు చేరవేయాలని కలెక్టర్ ఆదేశిస్తూ సంబంధిత సంక్షేమశాఖల అధికారులకు అందజేశారు. ఈ మేరకు బోధన్‌లోని ప్రభుత్వ ఇంటిగ్రేటెడ్ గర్ల్స్ హాస్టల్, నిజామాబాద్, రెంజల్, డిచ్‌పల్లి, ఆర్మూర్ బీసీ గర్ల్స్ హాస్టల్ విద్యార్థినులు, అర్గుల్ బీసీ బాయ్స్ హాస్టల్ విద్యార్థులకు దుప్పట్లు అందజేశామని జిల్లా బీసీ సంక్షేమాధికారి రమేశ్ తెలిపారు. కలెక్టర్ ఆదేశాలకనుగుణంగా నోట్‌పుస్తకాలు, పెన్నులను పదో తరగతి విద్యార్థులకు అందజేయనున్నట్లు పేర్కొన్నారు.

ఆన్‌లైన్ నమోదు ప్రక్రియ పరిశీలన

రుద్రూర్‌లో ఆన్‌లైన్ నమోదు ప్రక్రియను పరిశీలిస్తున్న డీపీవో జయసుధ

రుద్రూర్/ చందూర్, జనవరి 6 : రుద్రూర్ జీపీ కార్యాలయాన్ని డీపీవో జయసుధ శనివారం తనిఖీ చేశారు. కార్యాలయంలోని రికార్డులతోపాటు ప్రజాపాలన దరఖాస్తుల ఆన్‌లైన్ నమోదు ప్రక్రియను పరిశీలించారు. ఆమె వెంట ఎంపీడీవో బాలగంగాధర్, ఎంపీవో సాయిలు, కార్యదర్శి గంగాధర్ ఉన్నారు. చందూర్ మండలకేంద్రంలో ప్రజాపాలన దరఖాస్తుల ఆన్‌లైన్ నమోదు ప్రక్రియ ఎంపీడీవో నీలావతి ఆధ్వర్యంలో కొనసాగుతున్నది. తప్పులు దొర్లకుండా ఆన్‌లైన్ నమోదు చేపడుతున్నట్లు ఆమె తెలిపారు.

దరఖాస్తు చేసుకున్న ఉద్యమకారులు

నందిపేట్, జనవరి 6: తెలంగాణ మలిదశ ఉద్యమకారులు ప్రజాపాలనలో దరఖాస్తులు చేసుకున్నారు. ఉద్యమ సమయంలో కేసులు నమోదై అరెస్టయిన వారు ఎఫ్ఐఆర్ కాపీలను తీసుకుని దరఖాస్తులు చేసుకున్నారు.

బీఈడీ కళాశాలలో యోగా వర్క్‌షాప్ ప్రారంభం

నిజామాబాద్ రూరల్, జనవరి 6 : మండలంలోని సారంగాపూర్ టీయూ బీఈడీ కళాశాలలో యోగా వర్క్‌షాపును ప్రిన్సిపాల్ డాక్టర్ సాయిలు శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఆరోగ్యమే మహా భాగ్యమని, ప్లాస్టిక్ వస్తువుల వాడకాన్ని తగ్గించాలని విద్యార్థులకు సూచించారు. యోగా సిద్ధిరాములు మాట్లాడుతూ.. ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని అన్నారు. అనంతరం యోగాసనాలు వేసి యోగా ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మహిళలకు ఆటల పోటీలు

వర్ని, జనవరి 6 : సంక్రాంతిని పురస్కరించుకొని మండలకేంద్రంలోని సీసీడీలో మాదాల చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మహిళలకు పలు క్రీడాపోటీలను శనివారం నిర్వహించారు. పోటీల్లో సుమారు 200 మంది మహిళలు పాల్గొన్నారు. ఆదివారం ముగ్గుల పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు వెల్లడించారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు ఠాగూర్, జాస్తి శివనాగేశ్వరరావు, లయన్స్‌క్లబ్ సభ్యులు నర్సయ్య, కృష్ణ, కళాధర్‌రావు, జాస్తి శ్రీనివాస్‌రావు తదితరులు పాల్గొన్నారు.

నేడు పూలే, కాన్షీరాం విగ్రహాల ఆవిష్కరణ

■ ఏర్పాటు చేసిన 11 ఏండ్ల తర్వాత ..

నిజామాబాద్ రూరల్, జనవరి 6 : మండలంలోని జలాల్‌పూర్‌లో మహాత్మా జ్యోతిబా పూలే, కాన్షీరాం విగ్రహాలను 11 ఏండ్ల క్రితం ఏర్పాటు చేశారు. స్థానికంగా చోటు చేసుకున్న పలు ఘటనలు, ఐక్యతాభావం కొరవడడంతో విగ్రహాలు ఆవిష్కరణకు నోచుకోలేదు. అంబేద్కర్ యువజన సంఘం సభ్యులు ఒక కమిటీని ఎన్నుకుని, విగ్రహాల ఆవిష్కరణకు ఏర్పాట్లు చేశారు. దీంతో నేడు (ఆదివారం) ఉదయం 11 గంటలకు రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి విగ్రహాలను ఆవిష్కరించనున్నారు. అనంతరం ర్యాలీ, సభ నిర్వహించనున్నారు.

అదుపులో 'మల్లారం' హత్యకేసు నిందితులు?

నిజామాబాద్ క్రైం, జనవరి 6 : నిజామాబాద్ రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని మల్లారం అటవీ ప్రాంతంలో ఓ వ్యక్తి హత్య కేసు దర్యాప్తును పోలీసులు ముమ్మరం చేశారు. నాగారంలోని ఇంద్రాపూర్ ప్రాంతానికి చెందిన సయ్యాజీని గుర్తు తెలియని వ్యక్తులు హత్యచేయడంతో మృతదేహాన్ని శుక్రవారం పరిశీలించిన పోలీసులు.. ఘటనా స్థలం వద్ద మద్యం సీసాలు లభించడంతో దర్యాప్తును వేగవంతం చేశారు. అదనపు డీసీపీ జయరాం పర్యవేక్షణలో సౌత్ రూరల్ సీఐ వెంకటనారాయణ ఆధ్వర్యంలో రూరల్ ఎస్సై మహేశ్ సిబ్బందితో కలిసి దర్యాప్తు ముమ్మరం చేశారు. వివాహేతర సంబంధానికి అడ్డు వస్తున్నాడన్న కారణంతోనే హతమార్చినట్లు పోలీసుల దర్యాప్తులో వెలుగు చూసినట్లు తెలిసింది. మృతుడికి సన్నిహితంగా ఉండే వారితో అటవీ ప్రాంతానికి తీసుకెళ్లి, మద్యం తాగించి హత్య చేసినట్లుగా పోలీసులు నిర్ధారణకు వచ్చినట్లు సమాచారం. హత్య కేసులో అనుమానితురాలైన మహిళతోపాటు ఒకరు లేదా ఇద్దరు వ్యక్తులను సైతం పోలీసులు అదుపులోకి తీసుకొని, లోతుగా విచారణ జరుపుతున్నట్లు విశ్వసనీయ వర్గాల ద్వారా తెలిసింది. ఈ కేసుకు సంబంధించిన పూర్తి వివరాలను పోలీసులు మరో 24 గంటల్లో మీడియాకు వెల్లడించనున్నట్లు సమాచారం.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

మాక్లూర్, జనవరి6: వల్లభపూర్‌లో సీసీ రోడ్డు పనులను సర్పంచ్ సిలారి మంజుల శనివారం ప్రారంభించారు. రూ.3లక్షల నిధులతో ఈ పనులు చేపడుతున్నట్లు తెలిపారు. ఉప సర్పంచ్ గంగాధర్, బీఆర్ఎస్ నాయకులు సుధాకర్, రాజేశ్వర్‌రావు పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందన

సిరికొండ, జనవరి 6 : ఈ- అభ్యాస్ అకాడమీ, ట్రస్మా ఆధ్వర్యంలో నిర్వహించిన సైంటిఫిక్ అప్టిట్యూట్ టెస్ట్ (సాట్) -2023లో సత్యశోధక్ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చి జిల్లాస్థాయి (లెవల్-2)కి ఎంపికయ్యారు. విద్యార్థులను ఎంపీడీవో లక్ష్మీప్రసాద్ జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలను శనివారం అందజేసి అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నర్సయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

దివ్యాంగుడికి రూ. 50 వేల చెక్కు అందజేత

ఇందల్వాయి, జనవరి 6 : దివ్యాంగుల కోటా కింద ఇందల్వాయి గ్రామానికి చెందిన శ్రావణ్‌కుమార్‌కు ఎంపీపీ రమేశ్ నాయక్ రూ. 50 వేల చెక్కును శనివారం అందజేశారు. దివ్యాంగుడైన శ్రావణ్ మొబైల్ రిపేరింగ్ శిక్షణ నేర్చుకున్నాడని, మొబైల్ సర్వీస్ పాయింట్ షాపు ఏర్పాటు కోసం మండల పరిషత్ నిధుల నుంచి రూ. 50 వేలు అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో రాములునాయక్, ఎంపీటీసీ సుధాకర్, నాయకులు పాశం కుమార్, రఘు, శ్రీధర్, కార్యదర్శి భరత్, జూనియర్ అసిస్టెంట్ విమలాబాయి పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIEDS క్లాసిఫైడ్స్

WANTED TEACHERS
★Wanted Teacher's to teach Abacus English, Maths, Physics, Social & Lady Accountant Nursery to X -Std E/M Only Contact : 83095 82476.
NT-324502

WANTED
★త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 18K. Ph: 9640400073/9160900024.
NT-319407-All

OWN BUSINESS OFFER



★18-28 సం||ల యువతీ యువకులకు Rs. 49,000/- ల స్వల్ప పెట్టుబడిలోనే లోకల్ ఫ్రాంచైజీతో పర్మినెంట్ బిజినెస్ ఆదాయం. మల్టీసర్వీసెస్+ట్రైనింగ్+డైలీ సపోర్ట్ @ 15 సం||ల నమ్మకమైన సర్టిఫైడ్ సంస్థ W.W.I-Hyd. Ph: 9908743603.
NT-2580-All

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల క్లాసిఫైడ్స్ 200/- మాత్రమే.
ప్రతి అదనపు లైనుకు 50/- మాత్రమే
" పేరు మార్పిడి " ప్రకటన
4 లైన్లకు 250/-
ప్రతి అదనపు లైనుకు 50/- మాత్రమే
GST వర్తించును
సెల్ : 91827 77590

పాస్‌పోర్ట్ పోయినది
నేను అనగా MUTHYALA VIJAYA W/o. MUTHYALA GANGADHAR R/o.H.No.1-1-19 వినాయక్‌నగర్, నిజామాబాద్ నా యొక్క ఒరిజినల్ పాస్‌పోర్ట్ నెం.R5922040 గలది. తేది: 03-01-2024 మా ఇంటి నుండి బస్‌స్టాండ్ వైపు బైక్ పై వెళ్తుండగా పోయినది. ఎవరికైన దొరికినచో సంప్రదించ గలరు సెల్ : 9441525108

పాస్‌పోర్ట్ పోయినది
నేను అనగా MUTHYALA GANGADHAR S/o. MUTHYALA GANGARAM R/o.H.No.1-1-19 వినాయక్‌నగర్, నిజామాబాద్ నా యొక్క ఒరిజినల్ పాస్‌పోర్ట్ నెం.R595725 గలది. తేది: 03-01-2024 మా ఇంటి నుండి బస్‌స్టాండ్ వైపు బైక్ పై వెళ్తుండగా పోయినది. ఎవరికైన దొరికినచో సంప్రదించ గలరు సెల్ : 9441525108

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.